క్లుప్తంగా

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

ఖలీల్‌వాడి: ప్రభుత్వంలోని వివిధ శాఖలలో గల ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ డిమాండ్ చేశారు. నగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలోని ప్రభుత్వ శాఖల్లో రిటైర్మెంట్ అయిన తర్వాత కూడా సుమారు 1000 మంది విశ్రాంత ఉద్యోగులు పనిచేస్తున్నారని వారిని తొలగించి కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న వారితో పోస్టులను భర్తీ చేయాలని కోరారు. నాయకులు ఓమయ్య, రాజన్న, రఘురాం, రంజిత్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

ఖలీల్‌వాడి: ఇటీవల ఎన్నికల విధుల్లో ఉన్న ఆర్మూర్ మెప్మా ఆర్పీ గంగమణిపై దురుసుగా ప్రవర్తించిన ఆర్మూర్ బీజేపీ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డిపై ఎన్నికల అధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఐఎన్‌టీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్యాల గోవర్ధన్ డిమాండ్ చేశారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. పైడి రాకేష్‌రెడ్డి దూకుడుతత్వం వల్ల ఒక మహిళ ఉద్యోగం కోల్పోయి రోడ్డున పడ్డారని, దీనికి ఆయన బాధ్యత వహించాలన్నారు. గంగమణికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దేశహితమే ఎజెండాగా పోలింగ్



సుభాష్‌నగర్: దేశ హితమే ఎజెండాగా, ప్రజాస్వామ్య విలువలు కాపాడేవిధంగా నిజామాబాద్, జహీరాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ ప్రజలు, బాన్సువాడ అసెంబ్లీ నియోజకవర్గ ప్రజలు పోలింగ్‌లో పాల్గొన్నారని శాసనసభా పక్ష మాజీ నాయకుడు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యెండల లక్ష్మీనారాయణ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దేశం కోసం మోదీ.. మోదీ కోసం మనం అనే నినాదంతో ప్రజలు ఓట్లు వేశారని తెలిపారు. ఓటింగ్‌లో పెద్ద ఎత్తున పాల్గొన్న ప్రజలు, ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించిన అధికార, పోలీస్ యంత్రాంగానికి ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలియజేశారు.

లైబ్రరీకి పుస్తకాల వితరణ



జక్రాన్‌పల్లి: మండలంలోని పడకల్ గ్రామీణ గ్రంథాలయానికి గోర్తి ఈశ్వర ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఉషాబాల పవన్‌కుమార్ ఆధ్వర్యంలో పుస్తకాలను వితరణ చేశారు. ఈమేరకు ట్రస్ట్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పాట్కురి తిరుపతిరెడ్డి బుధవారం 40 రకాల పుస్తకాలను లైబ్రరీకి అందించారు. అంకం నరేష్, అల్లూరి గంగారెడ్డి, సట్ల సాయన్న,లోక పురుషోత్తం, లోక మహేందర్‌రెడ్డి, బాలాగౌడ్,సుమన్, ప్రవీణ్, తంబాకుల గంగారెడ్డి, రస్తుంఖాన్ పాల్గొన్నారు.

మార్క్‌ఫెడ్ చైర్మన్‌కు సన్మానం



సుభాష్‌నగర్: రాష్ట్ర మార్క్‌ఫెడ్ చైర్మన్ మార గంగారెడ్డి ఇటీవల ఎరువుల కంపెనీ ఇఫ్కో జాతీయ డైరెక్టర్‌గా ఎన్నికయ్యారు. ఈసందర్భంగా బుధవారం నగరంలోని జిల్లా సహకార కేంద్ర బ్యాంకులో ఆయనను ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ కుంట రమేష్‌రెడ్డి సన్మానించారు. సీఈఓ, డైరెక్టర్లు, బ్యాంకు జనరల్ మేనేజర్లు శుభాకాంక్షలు తెలియజేశారు. డైరెక్టర్లు చంద్రశేఖర్‌రెడ్డి, గోర్కంటి లింగం, శరత్, గిర్దావర్ గంగారెడ్డి, క్యాసాల శ్రీనివాస్‌రెడ్డి, శరత్, శంకర్, ఆనంద్, నాగంపేట్ శేఖర్‌రెడ్డి, సీఈఓ నాగభూషణం వందే తదితరులు పాల్గొన్నారు.

22న లక్ష్మీనరసింహస్వామి తిరుక్కల్యాణోత్సవం

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని మహాలక్ష్మినగర్‌లో ఈనెల 22న లక్ష్మీ నరసింహ స్వామి తిరుక్కల్యాణోత్సవం నిర్వహించనున్నట్లు ఆలయ ప్రతినిధులు రాచకొండ రుక్మిణి నరహరి ఒక ప్రకటనలో తెలిపారు. గంగోత్రి రామానుజాదాసన్ స్వామీజీ పర్యవేక్షణలో లక్ష్మీనరసింహ స్వామి ఏకోత్తర సహస్ర కలశ అభిషేకం, లక్ష్మీనరసింహస్వామి తిరుకల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. ముందురోజు 21న సాయంత్రం 6గంటలకు పండితులు నాని స్వామి స్వగృహం నుంచి స్వామి వారి ఊరేగింపు బయలుదేరి పూలాంగ్ హనుమాన్ జంక్షన్ మీదుగా మహాలక్ష్మి నగర్ చేరుకుంటుందని వారు తెలిపారు. వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో హాజరుకావాలని నిర్వాహకులు కోరారు .



నగరంలోని కొబ్బరిబొండం దుకాణం



నగరంలోని జ్యూస్‌సెంటర్

వేసవి తాపం.. పండ్లరసాలతో ఉపశమనం

- ఎండలకు తట్టుకోలేక జ్యూసులు తాగుతూ సేదతీరుతున్న జనం
- నగరంలో జోరుగా సాగుతున్న జ్యూస్ సెంటర్ల వ్యాపారం

నిజామాబాద్ రూరల్: ప్రస్తుతం మే నెలలో ఎండలు భగభగా మండుతూ అగ్నిగుండాన్ని తలపిస్తున్నాయి. ఉదయం 10గంటలు దాటిన తరువాత బయటకి రావాలంటే ప్రజలు బెంబెలేత్తే పరిస్థితి వచ్చింది. ఈక్రమంలో వివిధ పనుల నిమిత్తం బయట ఎండలో తిరిగే వారు ఉపశమనం కోసం జ్యూస్ సెంటర్లను ఆశ్రయిస్తున్నారు. ఎండ వేడిమి తట్టుకోలేక ప్రజలు కొబ్బరిబొండాలు, పండ్ల రసాలు తాగుతు సేద తీర్చుకుంటున్నారు.

పండ్ల రసాల దుకాణాలు కళకళ..

నగరంలో జ్యూస్ సెంటర్ల వ్యాపారం జోరుగా సాగుతోంది. వేసవి కావడంతో జిల్లా కేంద్రంలో జ్యూస్ పాయింట్‌లు కోకొల్లలుగా వెలిశాయి. ముఖ్యంగా నగరంలోని బస్‌స్టాండ్, రైల్వే స్టేషన్, ఖలీల్‌వాడి సహా ప్రధాన ప్రాంతాల్లో అధిక సంఖ్యలో జ్యూస్ స్టాళ్లు, చెరుకురసాల బండ్లు ఏర్పాటయ్యాయి. వివిధ పనుల నిమిత్తం నగరానికి వచ్చిన ప్రజలు సేదతీరడానికి ఆయా జ్యూస్ సెంటర్లలో వివిధ రకాల పండ్ల రసాలను తాగుతూ ఉపశమనం పొందుతున్నారు. ప్రజలు ఎండ వేడిమికి తట్టుకోలేక, అదేవిధంగా శరీరం డీహైడ్రేషన్‌కులోనుకాకుండా పండ్ల రసాలను తాగడంతో జ్యూస్ సెంటర్ల ఉదయం, మధ్యాహ్నం వేళ రద్దీగా మారుతున్నాయి.



కొబ్బరిబొండం నుంచి కొబ్బరి తీసే యంత్రం

వివిధ రకాల జ్యూస్‌లు.. కొబ్బరిబొండాలు..

నగరంలోని జ్యూస్ సెంటర్లలో వివిధ రకాల పండ్ల రసాలు అందుబాటులో ఉన్నాయి. వాటిలో మామిడి, పైనాపిల్, తర్బూజ జ్యూస్‌లు అధికంగా విక్రయిస్తున్నట్లు వ్యాపారులు పేర్కొంటున్నారు. బ్లాక్‌గ్రేప్స్, అరటి, వాటర్‌మిలాన్ తదితర జ్యూస్‌లు, చెరుకు రసాలు కూడా లభిస్తున్నాయి. ఒక్క గ్లాస్ జ్యూస్‌ను పండ్ల రకాలను బట్టి రూ.10 నుంచి రూ.40వరకు విక్రయిస్తున్నారు. అలాగే జిల్లా కేంద్రంలో బెంగుళూర్ కొబ్బరి బొండాలకు మంచి డిమాండ్ ఉంది. వాటిలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతోపాటు కొబ్బరి ఉండటంతో తాగడానికి ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. కొబ్బరి నీరు తాగిన తర్వాత ప్రత్యేక యంత్రం ద్వారా కొబ్బరి తీసిస్తున్నారు. ప్రస్తుతం ఒక్క కొబ్బరి బొండం రూ.70కి విక్రయిస్తున్నారు. అయినా ఎండలు తగ్గేవరకు, వేడిమి నుంచి ఉపశమనం పొందడానికి కొబ్బరిబొండాలకు, జ్యూస్ పాయింట్లకు జనం రద్దీ కొనసాగుతుందని వ్యాపారులు పేర్కొంటున్నారు.



కొబ్బరినీళ్లు తాగుతున్న ప్రజలు



జ్యూస్ సెంటర్ వద్ద యువకులు

బెంగళూరు బొండాలు ప్రత్యేకం..

బెంగుళూరు కొబ్బరి బొండాల్లో నీటి శాతం అధికంగా ఉండి ఆ రోగ్యానికి ఉపయోగపడే ఖనిజ లవణాలు ఎక్కువగా ఉంటాయి. అందువల్ల బెంగుళూరు కొబ్బరి బొండాలకు ప్రజలు ఎక్కువగా ప్రాధాన్యత ఇస్తున్నారు. నిత్యం దుకాణంలో 3వేల నుంచి 4వేల వరకు కొబ్బరిబొండాలను విక్రయిస్తున్నాం.

–ఆర్ అశోక్, కొబ్బరిబొండం దుకాణ యజమాని, నిజామాబాద్

అన్ని పండ్ల రసాలు అందుబాటులో..



జ్యూస్ సెంటర్‌లో అన్నిరకాల పండ్ల రసాలు అందుబాటులో ఉన్నాయి. రోజుకు 200 మంది జ్యూస్‌సెంటర్‌కు వచ్చి వివిధ రకాల పండ్లరసాలను సేవిస్తున్నారు. ఎండకాలంలో ప్రజలు సేద తీర్చుకోవడానికి పండ్ల రసాలు ఎంతగానో ఉపయోగపడుతుంది. మధ్యాహ్నం, సాయంకాలం జ్యూస్‌పాయింట్‌లో గిరాకీ ఎక్కువగా ఉంటుంది.

–సలీం, జ్యూస్ సెంటర్ యజమాని, నిజామాబాద్

నిత్యం కొబ్బరినీళ్లు తాగుతా..



నేను వేసవిలో రోజూ కొబ్బరిబొండాలను తాగుతాను. దీనివల్ల శరీరం డిహైడ్రేషన్‌కు లోనుకాకుండా ఉంటుంది. ఎండకాలంలో శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. అలాగే ఎండవేడి నుంచి ఉపశమనం కోసం వివిధ రకాల పండ్ల రసాలను కూడా తాగుతాను.

–స్వామి, నగర వాసి

సొసైటీ చైర్మన్ ఎన్నిక ఏకగ్రీవం



నియామక పత్రాన్ని అందజేస్తున్న డీసీవో



సొసైటీ చైర్మన్‌ను సన్మానిస్తున్న రైతులు, నేతలు

ధర్పల్లి: మండలంలోని హొన్నాజీపేట్ ప్రాథమిక సహకార సంఘం చైర్మన్‌గా వెంకంగారి జనార్దన్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు డీసీవో శ్రీనివాసరావు ప్రకటించారు. గత సొసైటీ చైర్మన్ రాజేందర్‌రెడ్డిపై ఇటీవల మెజారిటీ డైరెక్టర్లు అవిశ్వాసం ప్రవేశపెట్టగా ఇటీవల నెగ్గిన విషయం తెలిసిందే. ఈమేరకు డీసీవో శ్రీనివాసరావు బుధవారం సొసైటీ కార్యాలయంలో నూతన చైర్మన్ ఎంపిక కోసం ఎన్నిక నిర్వహించారు. ఈఎన్నికలో 12 మంది సొసైటీ డైరెక్టర్లు పాల్గొనగా, చైర్మన్ పదవి కోసం జనార్దన్ ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. ఈ నేపథ్యంలో జనార్దన్‌ను సొసైటీ చైర్మన్‌గా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీసీవో పేర్కొన్నారు. అనంతరం నూతన చైర్మన్‌కు నియామక పత్రాన్ని అందజేసి, వారితో ప్రమాణస్వీకారం చేయించారు. జనార్దన్ మాట్లాడుతూ.. సహకార సంఘం అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. అనంతరం రైతులు , నాయకులు నూతన చైర్మన్‌ను ఘనంగా సన్మానించారు. వైస్ చైర్మన్ మామిడి రాములు, సీఈవో గంగా నర్సయ్య, మాజీ సర్పంచ్ భగవాన్ రెడ్డి, పాప గంగారెడ్డి, సుభాష్, నరేందర్, ధర్మేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులు అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీపీ నర్సయ్య

పెర్కిట్: వర్షకాల సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో విద్యుత్, వైద్య శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంపీపీ పస్క నర్సయ్య సూచించారు. ఆర్మూర్ ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఎంపీపీ పస్క నర్సయ్య అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షకాల ప్రారంభంలో ఈదురు గాలలు వీచే అవకాశం ఉన్నందున విద్యుత్ శాఖ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రమాదాలు జరగకుండా చూడాలన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య శాఖ అధికారులు క్షేత్ర స్థాయిలో పని చేయాలన్నారు. దీంతో పాటు అకాల వర్షాలకు తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కడ్తా లేకుండా ప్రభుత్వమే కొనుగోలు చేసేలా కృషి చేస్తామన్నారు. ఆగస్టు 15లోగా రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామన్నా సీఎం రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా ఎంపీపీ రైతుల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన నివేదికలను చదివి వినిపించారు. సమావేశంలో జెడ్పీటీసీ సంతోష్, తహసీల్దార్ గజానంద్, ఎంపీడీవో సాయిరాం, ఏవో హరికృష్ణ, ఎంఈవో రాజగంగారాం, పీఆర్ ఏఈ నితీశ్, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ భవనం ప్రారంభం



భవనాన్ని ప్రారంభిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

రుద్రూర్: కోటగిరి మండల కేంద్రంలో పోల రాఘవేంద్రదీప్తి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మించిన లయన్స్ భవనాన్ని లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ వేమూరి లక్ష్మి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి బుధవారం ఇక్కడ కంటి పరీక్షలు నిర్వహిస్తారని అన్నారు. లయన్స్ కార్యక్రమాలకు సహకరించడంతో పాటు లయన్స్ భవనాన్ని నిర్మించి ఇచ్చిన ప్రముఖ వ్యాపారవేత్త, భవన నిర్మాణ దాత పోల విఠల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ మాజీ గవర్నర్ బస్వేశ్వరరావు, కొడాలి కిశోర్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు జి.హన్మంత్ రావు, కార్యదర్శి జానకి రావు, కోశాధికారి అనిల్ కుమార్, కేవీ మోహన్, శ్రీనివాస్ రావు, సింగిల్ విండో చైర్మన్ కూచి సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

సమాచారం..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

డిచ్‌పల్లి: మండలంలో గురువారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని డిచ్‌పల్లి ఏడీ శ్రీనివాస్, ఏఈ సాయిలు ఒక ప్రకటనలో తెలిపారు. డిచ్‌పల్లి, దూస్‌గాం, కమలాపూర్, మిట్టాపల్లి, రాంపూర్ గ్రామాల్లోని 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రాల్లో మెయింటెనెన్స్ కారణంగా, విద్యుత్ లైన్ల నిర్వహణ, చెట్ల కొమ్మలను కత్తిరింపు పనుల వల్ల అంతరాయం ఏర్పడుతుందన్నారు. ఆయా గ్రామాల్లో గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ కోత ఉంటుందని ఏడీ, ఏఈలు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

17న జాబ్ మేళా

నిజామాబాద్‌అర్బన్: నగరంలోని ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో ఈనెల17న(శుక్రవారం)జాబ్‌ఫెయిర్ (మేళా) నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ అంబోజీ హరిప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. టాటా ఎలక్ట్రానిక్స్, రిలియన్స్ అడ్డా, పేటీఎం, ఆక్సిస్ బ్యాంకు, ఫాక్స్‌కాన్ వివిధ కంపెనీల అధికారులు వస్తున్నారన్నారు. డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, బీటెక్ పూర్తిచేసిన విద్యార్థులు సంబంధిత సర్టిఫికేట్లతో శుక్రవారం ఉదయం 9 గంటలకు కళాశాలలో హాజరుకావలన్నారు.

18న మోపాల్ మండల సమావేశం

మోపాల్: మండల ప్రజాపరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం ఈనెల 18న ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో నిర్వహించనున్నట్లు ఎంపీడీవో లింగం నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ లతా కన్నీరాం అధ్యక్షతన సభ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అధికారులు తమ శాఖల నివేదికలతో సకాలంలో హాజరుకావాలని సూచించారు. ఎంపీటీసీలు సకాలంలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

ఉపాధి హామీ కూలి రేట్లు పెంచాలి



ఎడపల్లి: ఉపాధి హామీ కూలీలకు కూలి రేట్లు పెంచాలని అఖిలభారత ప్రగతిశీల రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్ముల గంగాధర్ బుధవారం పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి కూలీల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన రూ. 300 కూలీ రావటం లేదని, టెంట్లు లేవని మంచినీరు లేదని సదుపాయాలు కల్పించడం లేదన్నారు. ప్రభుత్వం కొలతలు లేకుండా పని పని కల్పించాలని కోరారు. ఆయన వెంట కె.రవి, లక్ష్మణ్, శంకర్, ఉపాధి కూలీలు ఉన్నారు.

సాదాసీదాగా రూరల్ మండల సమావేశం



సమావేశంలో సమస్యలపై అధికారిని నిలదీస్తున్న ఎంపీటీసీ గంగాధర్

నిజామాబాద్ రూరల్: మండలంలోని మాధవనగర్ సాయిబాబా ఆలయంలో బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ అనుష ప్రేమ్‌దాస్ నాయక్ అధ్యక్షతన ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ, జెడ్పీటీసీ బొల్లెంక సుమలత గోపాల్‌రెడ్డి, వైస్ ఎంపీపీ అన్నం సాయిలు ఆధ్వర్యంలో ఉదయ 11 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉండగా.. గంట అలస్యంగా 12గంటలకు ప్రారంభమైంది. సభలో సభ్యులు గ్రామాల సమస్యలపై అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా గుండారం గ్రామంలో తాగునీటి సమస్య ఉందని ఎంపీటీసీ అంకాల గంగాధర్ తెలిపారు. 24 గంటల్లో సమస్యలను పరిష్కరిస్తామని ఇన్‌చార్జి ఎంపీడీవో మధురిమ హామీ ఇచ్చారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలు అమలు కావడంలేదని ఎంపీటీసీలు ఆవేదన వ్యక్తం చేశారు. నాయబ్ తహసీల్దార్ వినయ్ సాగర్ మాట్లాడుతూ.. సమస్యలను ఉన్నతాధికారులుకు విన్నవించి పరిష్కరిస్తామని తెలిపారు. పలు శాఖల అధికారులు,ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.





డిచ్‌పల్లిలో మాట్లాడుతున్న తాత్కాలిక ఎంపీపీ నర్సయ్య.. పాల్గొన్న ఎంపీటీసీలు, అధికారులు

డిచ్‌పల్లి మండల కేంద్రంలో..

డిచ్‌పల్లి: మండలకేంద్రంలో బుధవారం తాత్కాలిక ఎంపీపీ చిన్నోల్ల నర్సయ్య అధ్యక్షతన డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సభ్యులు, అధికారులు వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై చర్చించారు. అలాగే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. జెడ్పీటీసీ దాసరి ఇందిర మాట్లాడుతూ.. వైద్య సిబ్బంది తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కుక్క కరిచిందని డిచ్‌పల్లి సామాజిక ఆరోగ్య కేంద్రం (సీహెచ్‌సీ)కు వచ్చిన వ్యక్తిని రేబిస్ ఇంజక్షన్ లేవని జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆస్పత్రికి వెళ్లాలని తిప్పిపంపించడం ఏంటని ప్రశ్నించారు. ఇలా అయితే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాల్సి ఉంటుందని జెడ్పీటీసీ హెచ్చరించారు. సభకు మండల వైద్యాధికారికి బదులుగా కిందిస్థాయి వైద్యసిబ్బంది హాజరవడంపై సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. పలు గ్రామాల్లో మిషన్ భగీరథ పైప్‌ల లీకేజీతో ప్రజలకు తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారని అమృతాపూర్, సాంపల్లి ఎంపీటీసీలు సాయిలు, బిక్యా నాయకులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ప్రతీసారి అనేక సమస్యలు అధికారుల దృష్టికి తెచ్చినప్పటికీ ఏ ఒక్క సమస్య పరిష్కారం కాకుండానే తమ పదవీ కాలం ముగిసిపోనుందని సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో తగిన సిబ్బంది లేరని, పౌష్టికాహారం అందించడం లేదని సభ్యులు ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రాలను సూపర్‌వైజర్లు తనిఖీ చేస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని ఎంపీడీవో రవీందర్ సూచించారు. తాత్కాలిక ఎంపీపీ నర్సయ్య మాట్లాడుతూ.. అధికారులు సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. హాజరు కానీ అధికారులపై చర్యల కోసం కలెక్టర్‌కుఫిర్యాదు చేస్తామని ఎంపీడీవో రవీందర్ తెలిపారు. ఎంపీటీసీలు, ఎంపీవో శ్రీనివాస్‌గౌడ్, ఎంఈవో రాజగంగారాం, సాంఘిక సంక్షేమ విద్యాలయాల సంస్థ జిల్లా కోఆర్డినేటర్ సంగీత, ఏఈ శ్రీధర్, మిషన్ భగీరథ డీఈ ధర్మేందర్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలోనే తొలిసారి..

డిచ్‌పల్లి మండల సర్వసభ్య సమావేశంలో ఆసక్తికర అంశం చోటు చేసుకుంది. ఎంపీపీ పదవిలో లేకపోతే వైస్ ఎంపీపీకి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగిస్తారు. అయితే ఇటీవలే ఎంపీటీసీలు అవిశ్వాస తీర్మానం ఇవ్వడంతో ఎంపీపీ గద్దెభూమన్న, వైస్ ఎంపీపీ కులాచారి శ్యాంరావు ఇద్దరూ తమ పదవులు కోల్పోయారు. అదే సమయంలో ఎన్నికల కోడ్ అమలులో ఉండటంతో అధికారులు ఎంపీపీగా ఇన్‌చార్జి బాధ్యతలు ఎవరికీ అప్పగించలేకపోయారు. ఈక్రమంలో ఎంపీడీవో రవీందర్ ఎంపీటీసీలలో ఒకరికి తాత్కాలిక బాధ్యత అప్పగించారు. సభ్యులందరి అంగీకారంతో నడిపల్లి–2 ఎంపీటీసీ సీహెచ్ నర్సయ్యకు ఎంపీపీగా సభకు అధ్యక్షత వహించారు. ఇలా తాత్కాలిక ఎంపీపీ అధ్యక్షతన మండల సర్వసభ్యసమావేశం జరగడం రాష్ట్రంలోనే తొలిసారి అని అధికారులు పేర్కొన్నారు.

పంట డబ్బుల కోసం వినతి

డొంకేశ్వర్: శనగ పంటను విక్రయించిన తమకు డబ్బులు చెల్లించాలని కోరుతూ సంబంధిత రైతులు బుధవారం తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ జిల్లా కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. క్వింటాలుకు ఎంత ధర కట్టిస్తారనే దానిపై ఇంత వరకు స్పష్టత ఇవ్వలేదని, రూ.7,500 కట్టివ్వాలన్నారు. ఇప్పటికే పంట సాగు చేసినందుకు తీసుకున్న అప్పులకు వడ్డీ పెరుగుతోందని, ఖరీఫ్ సాగుకు చేతిలో చిల్లి గవ్వ కూడా లేక ఇబ్బందులు పడుతున్నామని రైతులు తెలిపారు. పంట డబ్బులు త్వరగా చెల్లించాలని, లేదంటే శనగ పంటను తిరిగి ఇవ్వాలని రైతులు అధికారులను కోరారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	72,400	వెండి (కిలో)	86,500
22 క్యారెట్స్	66,785	– నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	10	20	గాజరుగడ్డ	40	60
బెండకాయ	30	50	పచ్చిమిర్చి	40	60
జీరకాయ	30	50	దోసకాయ	20	40
దొండకాయ	20	40	ఆలుగడ్డ	25	50
జీర్నిసుకాయ	30	60	గోబిగడ్డ	20	40
కాకరకాయ	50	70	గోబిపువ్వు	30	50
వంకాయ	30	60	బీట్‌రూట్	25	50
పాలకూర	25	50	కరివేపాకు	40	60
మెంతికూర	20	40	చామగడ్డ	40	60
కొత్తిమీర	25	50	గోరుచిక్కుడు	40	60
పుదీనా	40	60	చిక్కుడుకాయ	50	75
క్యాప్సికం	50	80			

– సుభాష్‌నగర్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్డ్	200
		లైవ్	180
స్కిన్‌లెస్	240	మటన్	800

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1	ప్రతినిధి-2 (తెలుగు) - 10.45, 4.30, 10.30; కృష్ణమ్మ(తెలుగు)- 1.35, ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు)-7.30
స్క్రీన్-2	ఆ ఒక్కటీ అడక్కు(తెలుగు) - 1.40; బాక్ (తెలుగు) - 4.30; కృష్ణమ్మ (తెలుగు) - 7.30, 10.30
స్క్రీన్-3	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (ఇంగ్లీష్) - 10.50, కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) - 1.45, 4.40, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1	ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 1.20, ఆరంభం (తెలుగు) - 4.15, ప్రసన్న వదనం (తెలుగు) - 7.40, బ్రహ్మచారి (తెలుగు) - 10.15
స్క్రీన్-2	కింగ్‌డమ్ ఆఫ్ ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు) - 11.45, 2.55, 6.05, 10.15
స్క్రీన్-3	ప్రతినిధి 2 (తెలుగు) - 12.15, 6.20, 9.15, బాక్ (తెలుగు) - 3.10
స్క్రీన్ -4	కృష్ణమ్మ (తెలుగు) - 12.45, 3.40, 6.35, 9.30
దేవి	టిల్లు స్క్వేర్ (తెలుగు) - 11.15, 2.15; ఆ ఒక్కటీ అడక్కు (తెలుగు) - 6.15, 9.15
నటరాజ్	కింగ్ డమ్ ఆఫ్‌ద ప్లానెట్ ఆఫ్‌ది ఏప్స్ (తెలుగు)
లలితామహల్	ప్రతినిధి 2 (తెలుగు)
విజయ్	కృష్ణమ్మ (తెలుగు)